క్లుప్తంగా

ఓటు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ విజయకుమార్



కొడంగల్ రూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: 18ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి విజయకుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుకు ఫారం 6, జాబితాలో అభ్యంతరాలకు ఫారం 7, సవరణలు చేసుకునేందుకు ఫారం 8లను నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని కొడంగల్‌తో పాటు అన్ని వార్డుల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల ర్లు, కో ఆప్షన్ సభ్యులు పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. వార్డుల్లోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉషారాణి, కమిషనర్ బలరాం నాయక్, మేనేజర్ గిరిజ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



నాగులపల్లి పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

పెద్దేముల్: పెద్దేముల్ మండల నాగులపల్లి, గోపాల్‌పూర్, రుద్రారం పాఠశాలలను శనివారం విద్యాధికారి నర్సింగ్‌రావు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెను ప్రకారం పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లతో పాటు విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వారంలో గుడ్లు ఎన్ని ఇస్తున్నారని వంట ఆయ, హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. సోమ, బుధ, శుక్రవారం మూడు రోజులు తప్పకుండా గుడ్లు ఇవ్వాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు సెలవు పెట్టినా, ఎక్కడికైన వెళ్లినా ఆయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఉండాలన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: విధి నిర్వహణలో బదిలీలు సహజమని కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శనివారం ముజాహిద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ మాడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి కృషిచేసే ఉపాధ్యాయులను ఎల్లకాలం గుర్తుంచుకుంటారన్నారు. ప్రిన్సిపల్ జ్యోతి హెప్సిబా, పీఈటీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కార్యాలయ సముదాయం హాల్లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు కె.పద్మావతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభమెన్నడో..?

కరువైన వైద్య సేవలు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా భవనం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలానికి వైద్య సేవలు కరువయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యసేవలు అందరికీ అందుబాటులో తీసుకొచ్చేక్రమంలో గత ప్రభుత్వం పల్లె దవాఖానా తీసుకొచ్చింది. వాటి నిర్మాణం పూర్తయినప్పటికీ అవి ప్రారంభానికి నోచుకోకపోవడంతో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. మండల వాసులకు వైద్య సదుపాయలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ఏదైన ప్రమాదం సంభవిస్తే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటే పట్టణాలకు వెళ్లాల్సిందే. అక్కడ ప్రైయివేట్ ఆస్పత్రులకు ఎక్కువమొత్తంలో డబ్బు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుద్యాల్, హకీంపేట, చిలుముల మైల్వార్, హంసంపల్లి, హస్నాబాద్ వంటి గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు నిత్యం ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. జ్వరం, జలుబు వంటి వాటికి సాధారణ చికిత్స చేస్తు న్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానా అందుబాటులో తీసుకొస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో సేవలు..

మండల కేంద్రంలో నిర్మించిన పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోవడంలేదు.

ప్రస్తుతం ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఆ ఉపకేంద్రాన్ని అక్కడ ఓ ఇరుకు గదిలో నిర్వహించడంతో ప్రథమ చికిత్స చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వైద్య సిబ్బంది, రోగులు వాపోతున్నారు. పల్లె దవాఖానా భవనం ప్రారంభిస్తే వైద్య సేవలను అందరికీ అందుబాటులో తేవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె దవాఖానాను సత్వరమే ప్రారంభించాలని కోరుతున్నారు.



పరిగి: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి నాగుల శిల్ప



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి శ్రీరామ్

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

పరిగి సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్పా

పరిగి: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతాయని పరిగి సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్పా పేర్కొన్నారు. శనివారం నేషనల్ లోక్ అదాలత్‌ను పరిగి సివిల్ కోర్టులో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 21, డ్రంక్అండ్ డ్రైవ్ 93, ఇతర కేసులు మొత్తం123 పరిష్కరించారన్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ రాజీతో ఎన్నో ఏళ్ల నుంచి చిక్కుముడిగా ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి భక్తకుమార్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రథమశ్రేణి న్యాయమూర్తి బి శ్రీరామ్ సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన కక్షిదారులకు పలు సూచనలు చేశారు. చిన్న చిన్న కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. అనంతరం సీసీ ఐపీసిలో 11 కేసులు, సీసీ ఎక్సైజ్ 36కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్(ఎస్‌టిసి) 38కేసులు, ఎంసీ ఒకటి, సమ్మర్ డ్రైవ్ కేసులు 2 పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో బస్వరాజ్, బార్ అసోషియేషన్ మెంబర్స్, మండల్ లీగల్ కమిటీ స్టాఫ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చదవులో నిర్లక్ష్యం వద్దు

మండల విద్యాధికారి వెంకట్



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థుల చదవు విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండొద్దని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. శనివారం దోమ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్, బోధనోపకరణాలు, టీఎల్ఎంను ఉపయోగించి విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలన్నారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్య బోధిస్తే మండలంలో ఉత్తీర్ణత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్య నాయక్, ఆంజనేయులుగౌడ్, అమర్నాథ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్



మాట్లాడుతున్న రవిగౌడ్ తదితరులు

తాండూరు రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయమని డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ సంస్థ రైతులకోసమే పని చేస్తోందని తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఐనెల్లి గ్రామ శివారులోని రైతు వేదిక వద్ద నందీశ్వర రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయమే లక్ష్యంగా ఏకలవ్య ఫౌండేషన్ పని చేస్తోందన్నారు. రైతులందరిని సంఘంగా ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు సరైన ధరలకు అందిస్తున్నారన్నారు. ఆసక్తిగల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చని దీనికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు. అనంతరం ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడారు.ఏకలవ్య ఫౌండేషన్‌లో సభ్యత్వం ఉన్న రైతుల పంటలను కొనుగోలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి,ఏఓ కొమరయ్య, నారాయణరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, విజయ్, మాధవరెడ్డి,గోపాల్,శివకుమార్,అశోక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



దోమ: దిర్సంపల్లిలో గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ: ప్రభుత్వ పథకాలు అర్హులందరికి ఇస్తామని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో మహిళలకు గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శంకుస్థాపన

పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దిర్సంపల్లి పాఠశాలలో రూ.27 లక్షలతో సైన్స్‌ల్యాబ్, అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలివిజయ్‌కుమార్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మొగులయ్య గౌడ్, రాములుగౌడ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమపథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహశీల్దారు గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, వెంకట్రావు, వీరన్న, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, దస్తప్ప, వెంకట్రాములు, ఆశప్ప, తదితరులు పాలొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం అంతారం, చెరువుముందలి తండాలలో లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీడీవో రామకృష్ణ, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, అంతారం మాజీ సర్పంచ్ కృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ కానుకుర్తి నర్సిరెడ్డి, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు



కుల్కచర్ల: లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్ అందిస్తున్న భీంరెడ్డి

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్



రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ అన్నారు. శనివారం చౌదర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లా రాజేశ్ రెడ్డికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కడంతో కాంగ్రెస్ నియోజకవర్గ నేత తిరుపతిరెడ్డి, మండల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశ్ తదితరులు షాలువా కప్పి పూలమాలలు వేసి రాజేశ్‌రెడ్డిని సన్మానించారు.

ఎస్‌ఐ విఠల్‌రెడ్డికి సన్మానం

తాండూరు రూరల్: గౌతపూర్ శివారులోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డికి పలువురు సన్మానించారు. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ అవార్డు రావడంతో శనివారం చంద్రవంచ గేటు సమీపంలోని పల్లెగూడ హన్‌మాన్ దేవాలయం వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విఠల్‌రెడ్డి మాట్లాడారు. అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, జర్నప్ప, ప్రసాద్, వీరారెడ్డి, విజయ్‌పటేల్, జగ్గు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు



ఎస్‌ఐకి జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం



తాండూరు రూరల్: సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో కాంతారావు తదితరులు

దౌల్తాబాద్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతిదేవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పోషక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు బరువు, ఎత్తు ప్రతి నెలా తీయాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, కవిత, కృష్ణవేణి, సంగీత, పద్మ, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో కాంతారావు, అడిషనల్ సీడీపీవో శ్రీలక్ష్మి పాల్గొని మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్త హీనతను అధిగమించొచ్చన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస్యం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుశీల, రాణి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



దుద్యాల్: పౌష్టికాహార వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీస్ సూపర్‌వైజర్ ప్రభ

దుద్యాల్‌లో..

దుద్యాల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని, రక్త హీనతను అరికట్టొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభ పేర్కొన్నారు. హస్నాబాద్ గ్రామంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకమాసోత్సవం నిర్వహించారు. అనంతరం 65 ఏళ్లు నిండిన ఆయాలను సన్మానించారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

ఎంపీడీవో మహేశ్‌బాబు

దోమ: స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులను ఆదుకోవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లితండా ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్‌తో కలిసి ఆయన విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పల్లవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వర్షాలకు పత్తికి నష్టం

దౌల్తాబాద్: రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని భూములు పత్తి సాగుకు అనుకూలంగా ఉండడం, వరి తర్వాత ఎక్కువ మంది రైతులు పత్తి సాగు చేశారు. పంట సాగు సమయంలో పరవాలేదనిపించినా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పత్తికాయ పూర్తి స్థాయిలో పగిలే తరుణంలో ఉంది. అక్కడక్కడ కాయలు పగిలి పత్తి బయటకు వస్తుంది. వాతావరణం ఇలాగే కొనసాగితే పంటలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

కుల్కచర్ల: ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం కాలుష్యమౌతుందని చౌడాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చౌడాపూర్ గ్రామంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువకాలం భూమిలో కరగకుండ ఉండిపోతాయని, దీంతో వాయుకాలుష్యం ఏర్పడుతుందన్నారు. దుకాణదారులు తమ దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, రాజు, శ్రవణ్, షఫీ, రవి, నరేందర్, ఉస్మాన్ అహ్మద్, వీరేషం, శివకుమార్, బి.వెంకటేష్, రాములు, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

• బాల్య వివాహాలపై అవగాహన

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు కొనసాగుతున్నాయని, వాటిని నిరోధించేందుకు ప్రజలకు అవగాహన కల్పిచాంచారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ధారూరు మండలంలోని తరిగోపుల, మోమిన్‌కలాన్ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వారు ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సాధన సంస్థ కార్యనిర్వాహకుడు చిక్కు రాహుల్ మాట్లాడారు. ఎక్కడైన బాల్య వివాహం నిర్వహిస్తున్నారని తెలిస్తే 18001027222, లేదా 1098, 100 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తరిగోపులపాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, సాధన సంస్థ మండల కోఆర్డినేటర్ అంజయ్య, సోషల్ కమ్యునిటీ మొబిలైజర్లు తదితరులు పాల్గొన్నారు.

• ప్రత్యేక శిక్షణా తరగతులు

కొడంగల్ రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు దోహదపడతాయని రీసోర్స్‌పర్సన్ సంజీవులు పేర్కొన్నారు. శనివారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 5రోజులుగా ఉమెన్ అండ్ ఏఐ కార్యక్రమం ద్వారా కళాశాలలోని విద్యార్థినులకు ఎక్సెల్, బిఐ, డేటామోడలింగ్, డేటావిజువలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై రీసోర్స్ పర్సన్ సంజీవులు శిక్షణ ఇస్తున్నారన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రఫియాఖానమ్ మాట్లాడారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎట్ ఎడ్యుకేషన్, డెల్ టెక్నాలజీ వారి సహకారంతో రీసోర్స్‌పర్సన్ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు.

• ఇంచార్జి ఎంపీఓగా భాస్కర్ గౌడ్

కుల్కచర్ల: కుల్కచర్ల మండల ఇంచార్జి ఎంపీఓగా భాస్కర్ గౌడ్ నియమితులయ్యారు. ఇంతకు ముందున్న ఎంపీఓ పదోన్నతిపై పరిగి వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం ఎంపీడీవో రామకృష్ణ నియామకపత్రం అందజేశారు. అనంతరం ఎంపీఓగా నియమితులైన భాస్కర్ గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేశ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

• ఓటరు జాబిత విడుదల

పెద్దేముల్: పెద్దేముల్ మండల గ్రామ పంచాయతీ వార్డుల వారిగా ఓటరు జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్‌లు విడుదల చేశారు. గ్రామ పంచాయతీ వార్డుల వారిగా తుది జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఉంచారని తెలిపారు.

• దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: గ్రామపంచాయతీ ఓటర్ తుదిజాబితాను అధికారులు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విడుదల చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి



సల్బత్తాపూర్‌లో సభ్యత్వ నమోదు రసీదును అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

బంట్వారం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం బంట్వారం మండలంలోని ఆయా పాఠశాలల్లో ఆయన సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఇటీవల విద్యాశాఖ విడుదల చేసిన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయని వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, దేవయ్య, దేవ్యానాయక్, శ్రీనివాస్, బందయ్య, రఘు, ప్రకాష్, వెంకటేష్, దీపక్‌రాథోడ్, శేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.